

జ్ఞానభూమి పోర్టల్‌లో డీఎస్సీ అభ్యర్థుల వివరాలు

చిత్తూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉచిత డీఎస్సీ శిక్షణలో భాగంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల వివరాలను జ్ఞానభూమి పోర్టల్‌లో పొందుపరిచామని, పోర్టల్‌లో ఉన్నవారు ఈ నెల 28వ తేదిలోపు ఎంపానెల్డ్ కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్ సర్వీసు ద్వారా ప్రాధాన్యత ఇవ్వాలని సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారి చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ , భోజన వసతులను కల్పించే ప్రైవేటు శిక్షణా సంస్థలను గుర్తించిందన్నారు. వాటికి సంబంధించిన అభ్యర్థుల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. ఫేజ్-1లో వెబ్ ఆప్షన్‌ను పూర్తి చేసిన వారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదన్నారు. ఫేజ్-2లో జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీచర్ల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ల సీనియారిటీ జాబితాపై శనివారం వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ల ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా ఈనెల 4న వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి, తాజా సీనియారిటీ జాబితాను జడ్పీ, ప్రభుత్వ, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల వారీగా జాబితా సిద్ధం చేసి డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలను శనివారం సాయంత్రం 5 గంటల లోపు తగిన ఆధారాలతో డీడీవో ధ్రువీకరణ పత్రంతో డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (గురువారం సాయంత్రం)

సహర్: 4:52 (శుక్రవారం ఉదయం)

ఇప్పుడూ వారిదే రాజ్యం..!!

- వైసీపీ హయాంలో పెద్దిరెడ్డికి అనుకూలంగా పనిచేసిన తహసీల్దార్లు
- ప్రస్తుతం కూడా కీలక మండలాల్లో విధులు



చిత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల పేరుతో ప్రభుత్వ భూమికి పట్టాలివ్వడం, భూసేకరణ సమయంలో తప్పుడు పట్టాలిచ్చి పరిహారం దక్కేలా చేయడం, అర్హత లేకున్నా భూములకు ఫ్రీహోల్డ్ చేయడం, గత ప్రభుత్వ హయాంలో మంత్రి పెద్దిరెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు సామాన్యులకు అన్యాయం చేయడం... ఇవీ వైసీపీ హయాంలో పుంగనూరు నియోజకవర్గంలో పనిచేసిన తహసీల్దార్ల తీరు.అయితే అప్పట్లో ఇలా పనిచేసిన వారంతా కూటమి ప్రభుత్వంలో కూడా కీలక స్థానాల్లో పనిచేస్తూ ఉండడమే విశేషం.

● ఐదేళ్లూ సోమలలోనే..

సాధారణంగా తహసీల్దార్ల కొరత ఉన్నప్పుడు డీటీలకు ఎఫ్‌ఏసీగా బాధ్యతలు అప్పగిస్తారు. వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు తహసీల్దార్లు ఉన్నా, వారికి అవసరమైన డీటీలకు ఇన్‌ఛార్జి బాధ్యతల్ని ఇప్పించుకున్నారు. అలా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అనే డీటీ వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు సోమలలో ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా పనిచేశారు. ఓ డీటీ అయి ఉండి, ఐదేళ్ల పాటు ఒకే మండలంలో తహసీల్దార్‌గా పనిచేయడం జిల్లా చరిత్రలో ఓ రికార్డు. సోమలలో ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణ విషయం తీవ్ర వివాదంగా మారిన విషయం తెలిసిందే. ఆ ప్రాజెక్టు భూసేకరణ విషయంలో ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చి పరిహారం అందేలా చేశారని ఈయనపై ఆరోపణలున్నాయి. గత ఏడాది రాష్ట్రంలో అధికారం మారాక కలెక్టరేట్‌కు చేరిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పౌరసరఫరాల శాఖలో డీటీగా పని చేస్తున్నారు.ఇటీవల జరిగిన బదిలీల్లో బైరెడ్డిపల్లెకు మారారు.అయితే ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు.

● చౌడేపల్లెలో ఏకపక్షంగా..

ప్రస్తుత బైరెడ్డిపల్లె తహసీల్దార్ మాధవరాజు వైసీపీ హయాంలో ఐదేళ్లపాటూ చౌడేపల్లె, పుంగనూరు మండలాల్లో పనిచేశారు.ప్రభుత్వం మారాక బైరెడ్డిపల్లెకు బదిలీ అయ్యారు. ఇటీవలి బదిలీల్లో గంగవరానికి మారారు.అయితే ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు.చౌడేపల్లెలో సుమారు 300 ఎకరాలకు డీకేటీ భూముల లబ్ధిదారుల పేర్లను మార్చినట్లు ఈయనపై ఆరోపణలున్నాయి. పెద్దిరెడ్డి ఏం చెబితే అది తు.చ తప్పకుండా పాటిస్తారనే పేరును స్థానికంగా తెచ్చుకున్నారు. దీంతో పాటు చౌడేపల్లె బస్టాండు వద్దనున్న టీడీపీ దిమ్మె తొలగింపు ఘట్టం ఈయన ఆధ్వర్యంలోనే జరిగినట్లు అక్కడి టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

● ఫ్రీహోల్డ్‌లో పెద్దఎత్తున అక్రమాలు

పుంగనూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున భూముల్ని ఫ్రీహోల్డ్ చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా అక్రమాల నిగ్గు తేల్చింది. పుంగనూరులో 11352 ఎకరాలు, సోమలలో 9174, చౌడేపల్లెలో 6389, సదుంలో 6063, రొంపిచెర్లలో 3925, పులిచెర్లలో 4346 ఎకరాల్ని ఫ్రీహోల్డ్ చేసుకోగా.. 75 శాతం అక్రమంగా చేసుకున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఆయా భూముల్ని హోల్డ్‌లో కూడా ఉంచారు.

● ఏకంగా సీఎం నియోజకవర్గంలో..

వైసీపీ హయాంలో పుంగనూరు తహసీల్దార్‌గా పనిచేసిన సీతారామ్ ప్రస్తుతం సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలోని గుడుపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పుంగనూరు మండలంలోని రాగానిపల్లెలో 982 ఎకరాల భూఅక్రమాల విషయం బయటపడిన విషయం తెలిసిందే. ఈ అక్రమాల ఫైల్ కదిలించిన వ్యక్తి అప్పట్లో అక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సీతారామే. అలాగే తీవ్ర వివాదాస్పదమైన నేతిగుట్లపల్లె ప్రాజెక్టు విషయంలో.. భూసేకరణ అయ్యాక రైతులకు పరిహారం ఇప్పించడంలో పెద్దిరెడ్డి సూచనల మేరకు అలసత్వం వహించారన్న అపప్రధను మూటగట్టుకున్నారు.

● వీళ్లతో పాటు పులిచెర్లలో, సదుంలో వైసీపీ నాయకులు చెప్పినట్లు పనిచేసిన కె.అమరనాథ్, చంద్రశేఖర్ ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్ని మార్చారనే ఆరోపణలున్నాయి.అమరనాథ్ ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కీలకమైన నిమ్మనపల్లెలో, చంద్రశేఖర్ జీడీనెల్లూరులో పనిచేస్తున్నారు.

ఎన్నికల హామీలపై నారా భువనేశ్వరి

చంద్రబాబు మీ కలలన్నీ నెరవేరుస్తారంటూ భరోసా

ఓపిక పడితే అన్నీ నెరవేరుతాయి

భువనేశ్వరి మాటలతో మహిళల ముఖాల్లో నవ్వుల పువ్వులు


మహిళ ప్రసంగానికి చప్పట్లు





కుప్పం/ గుడుపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'మీ నాయకుడు చంద్రబాబు మీకు, మీ కుటుంబాలకు అవసరమైన అన్ని పథకాలూ అమలు చేస్తున్నారు. కాకపోతే పథకాలు కొంచెం ముందు వెనుక అవ్వచ్చు. ఓపిక పట్టాలి. ఓపిక పడితే అన్నీ నెరవేరుతాయి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మహిళలకు హామీ ఇచ్చారు. కుప్పం పర్యటనలో తొలిరోజైన బుధవారం ఆమె గుడుపల్లె మండలం గుడిచెంబగిరి గ్రామంలో మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, బ్యాండు మేళాలతో భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపారమైన మహిళా శక్తికి నమస్కారం అంటూ ప్రసంగం ప్రారంభించారు. ఆమెను చూడగానే మిమ్మల్ని చూడడం మాకు చాలా సంతోషంగా ఉన్నదని మహిళలు చెప్పారు. దీంతో స్పందించిన భువనేశ్వరి 'మీ ముఖంలో సంతోషం చూసి తనకు కూడా చాలా సంతోషంగా వుంది' అన్నారు.'చంద్రబాబు నాయత్వం మీద మీకున్న నమ్మకం నన్ను ముగ్ధురాలిని చేస్తోంది. మీ నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము కానివ్వకుండా ఆయన కూడా పథకాలు ఒక్కటొక్కటే అమలు చేసుకుంటూ వస్తున్నారు' అని పేర్కొన్నారు. రోడ్లు నిర్మించారని, గోకులం షెడ్లు రైతులకోసం రాయితీతో నిర్మిస్తున్నారని చెప్పారు. సోలార్ సిస్టం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసే పథకం కూడా కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న విషయం గుర్తు చేశారు. ఈ ప్రాజెక్ట్ వల్ల విద్యుత్తు ఉచితంగా లభించి, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఖర్చు ఎంతో ఆదా అవుతుందన్నారు. వేసవి తీవ్రమై నీటి కరువు ఏర్పడుతుందని ముందే పసిగట్టిన చంద్రబాబు, నీటి ఎద్దడి నివారణకోసం ముందస్తు చర్యలు తీసుకున్నారన్నారు. గుడుపల్లె మండలంలోనే మూడు నెలల వ్యవధిలో 11 బోర్లు వేసి, తాగునీటిని సరఫరా చేయడానికి సిద్ధం చేశారని గుర్తు చేశారు. 'మీ నాయకుడు ఎన్నికల్లో మాత్రం కనిపించి తర్వాత మాయమవడు. ఇక్కడే మీ ముందరే నిలబడి మీకేం కావాలో అన్నింటినీ పథకాల ద్వారా ఇస్తాడు.' అంటూ భువనేశ్వరి పరోక్షంగా ప్రతిపక్ష నాయకుడి మీద చురకలు వేశారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కరువొస్తే ఇంటింటికీ బియ్యం బస్తాలు పంపిణీ చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. కొంచెం ఓపిక పడితే అన్నీ సమకూరుతాయని, చంద్రబాబు ప్రజల కలలను తప్పకుండా నెరవేరుస్తారని భువనేశ్వరి హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్నంత మమకారం ఆయన సతీమణి భువనేశ్వరికి కూడా వుందని చెప్పారు. టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, గుడుపల్లె టీడీపీ అధ్యక్షుడు బాబునాయుడు, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్, జీఎం.రాజు, మాజీ జడ్పీటీసీ బేటప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేస్తాం





అమరావతి సదస్సులో చంద్రబాబు ప్రసంగం, పాల్గొన్న కలెక్టర్లలో సుమిత్ కుమార్

● కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

చిత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఎక్కువగా వున్న మామిడి పంటను దృష్టిలో పెట్టుకుని చిత్తూరు జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. బుధవారం అమరావతిలో జరిగిన రెండో రోజు కలెక్టర్ల సదస్సులో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రగతి వివరాలు, సమస్యలను కలెక్టర్ ప్రతిపాదించగా.. సీఎం సానుకూలంగా స్పందించారు. కుప్పంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రధాన సమస్యగా పరిణమించిన ఏనుగులు, కోతుల సమస్యను నివారిస్తామన్నారు. గతంలో కోతులకు స్టెరిలైజేషన్ చేశామని, ఆ దిశగా మరోసారి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పలమనేరు నియోజకవర్గానికి గండికోట నుంచి మంచి నీటిని సరఫరా చేస్తామన్నారు. ఏడు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.. జిల్లాల వృద్ధి రేటు విషయంలో అన్నమయ్య జిల్లా 13.22 శాతం సాధించగా.. ఆ తర్వాతి స్థానాల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాలు నిలిచాయన్నారు.

● 50 శాతం రాయితీతో మామిడి రైతులకు కవర్లు

అన్నమయ్య జిల్లాలో మామిడి పండ్లకు కవర్లు కట్టడంతో మంచి దిగుబడి వస్తోందని, రైతులకు లాభాలూ వస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ చెప్పారు. ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని చెప్పిన సీఎం చంద్రబాబు, రైతులకు సబ్సిడీతో కవర్లను అందించాలన్నారు. ఎకరాకు రూ.24 వేలు ఖర్చవుతుందని అధికారులు సీఎంకు వివరించగా.. 50 శాతం రాయితీ ఇవ్వాలని అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు. ఈ రాయితీ పథకంతో మన జిల్లాలోని మామిడి రైతులూ లబ్ధి పొందనున్నారు.

● లైవ్‌స్టాక్ ప్రాజెక్టు ప్రతిపాదనపై అభినందన

జిల్లాలో 3.65 లక్షల మంది రైతులకు లబ్ధి కలిగేలా లైవ్‌స్టాక్ ప్రాజెక్టు అమలు కోసం కలెక్టర్ సుమిత్ కుమార్ చేసిన ప్రతిపాదనను సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద మొత్తంలో సంపద సృష్టించి చిట్టచివరి నిరుపేద వరకు ఆ సంపదను పంపిణీ చేస్తామని ప్రతిపాదించారు. ఇదే తరహాలో ఈ ప్రాజెక్టును అన్ని జిల్లాల్లో ప్రతిపాదిస్తూ సంపదను సృష్టించాలని సీఎం సూచించారు.





సుగుటూరు గంగమ్మ - గంగమ్మ దర్శనం కోసం ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

హెలికాప్టర్‌తో పూలవర్షం

సుగుటూరు గంగమ్మ ఆలయంపై బుధవారం హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించిన సంఘటన భక్తులను ఇక్కట్లకు గురిచేసింది. బెంగళూరు నుంచి సినీనటుడు సప్తగిరి, టీడీపీ నాయకుడు ఆర్వీటీ బాబు హెలికాప్టర్‌లో పుంగనూరుకు వచ్చారు.అమ్మవారి ఆలయ సమీపంలో తక్కువ ఎత్తు నుంచి హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించగా ఆ గాలికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానా టెంట్లు కొన్నిచోట్ల లేచిపోయాయి. విపరీతంగా దుమ్ము రేగడంతో భక్తులు పరుగులు తీశారు. పోలీసులు, నిర్వాహకులు వెంటనే షామియానాలు భక్తులపై పడకుండా సరిదిద్దారు.



గెరిగెలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

జనసంద్రమైన పుంగనూరు

● గెరిగెలతో మొక్కులు తీర్చుకున్న గంగమ్మ భక్తులు

పుంగనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం పుంగనూరు జనసంద్రంగా మారింది.ఎండ తీవ్రత ఉన్నా భారీసంఖ్యలో భక్తులు నియమనిష్ఠలతో గంగమ్మకు గెరిగెలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి పురవీధుల్లో ఘనంగా ఊరేగిన అమ్మవారిని నిర్వాహకులు బుధవారం వేకువజామున జమిందారీ ప్యాలెస్‌లోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో భక్తుల దర్శనం కోసం కొలువుదీర్చారు. తోటి కులస్తులు గంగమ్మకు జంతుబలులు సమర్పించిన తరువాత పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. పట్టణంలో ఎక్కడ చూసినా పిల్లలు, పెద్దలు, మహిళలు గెరిగెలతో మంగళవాయిద్యాల నడుమ వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పురుషులు కొంతమంది మహిళల వేషంలో గెరిగెలతో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. గంగమ్మ ఆలయంలోకి చేరుకోగానే బజారువీధిలో నడివీధి గంగమ్మను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పుంగనూరు అష్ట గంగమ్మలు నల్లరాళ్ల గంగమ్మ, మల్లారమ్మ, స్థలగంగమ్మ, మారెమ్మ, విరూపాక్షమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో ఆలయాలు కిక్కిరిశాయి.విద్యుత్ దీపాలంకరణతో దేవతామూర్తులను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక రాంపల్లె, విరూపాక్షి మారెమ్మ విగ్రహాలను చాందినీబండ్లపై ఏర్పాటు చేసి బుధవారం తెల్లవారుజాము వరకు ఊరేగించారు.






చోటా కె.నాయుడు, వశిష్ఠ - జస్టిస్ శివసుబ్రహ్మణ్యం

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ దర్శకుడు వశిష్ఠ, సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు, నటి దివి, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




దివి

ఎస్వీయూ బాల్ బ్యాడ్మింటన్ మహిళా జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), మార్చి 26(ఆంధ్రజ్యోతి) : కేరళ కారైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో ఈ నెల 29న జరగనున్న ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ మహిళా జట్టు ఎంపికైంది. బుధవారం ఎస్వీయూ వ్యాయామ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. టోర్నమెంటులో రాణించాలని ఆకాంక్షించారు. టీం కోచ్‌గా డాక్టర్ డి.రెడ్డిభాస్కర్, మేనేజర్‌గా ఎ.నరసింహారావు వ్యవహరించనున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి ఉన్నాయి. క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,252

తలనీలాలు సమర్పించినవారు: 25,943



తిరుపతి శ్రీ కోదండరామాలయం

రాములోరి వేడుకలకు రారండోయ్..

● నేటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతిలోని కోదండ రామాలయంలో గురువారం నుంచి బ్రహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 4వరకూ జరిగే ఈ వేడుకల నిర్వహణకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు చలువ పందిళ్లు వేశారు. ఆలయం, మాడ వీధులకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు కోదండరామయ్య వాహనాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ప్రాచీనమైన తిరుపతి కోదండరామాలయం విశేషాలు..

-తిరుపతి(టీటీడీ), ఆంధ్రజ్యోతి

ప్రాచీన కాలం నాటిది కోదండరామాలయం. విశేష చరిత్ర ఉన్న ఈ ఆలయం తొలినాళ్లలో తిరుపతికి ఉత్తరాన ఉండేది. ఊరు విస్తరించడంతో ప్రస్తుతం నగరం మధ్యన దర్శనమిస్తోంది. ఆలయానికి సంబంధించి అచ్యుతరాయల కాలంలో కుమార రామానుజ అయ్యంగార్ వేయించిన శాసనమొకటి లభించింది. క్రీ.శ.1480లో సాళువ నరశింహుడి కాలంలో శఠగోపదాసర్ నరసింహాచార్య మొదలియార్ కోదండ రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్లు శాసనం ద్వారా తెలుస్తుంది. అంతకుముందే ఆలయంలో స్వామి విగ్రహాన్ని జాంబవంతుల వారు ప్రతిష్ఠించారనేది ఐతిహ్యం. రామచంద్ర పుష్కరిణి ఉన్న ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు లభించడంతో జనమేజయ చక్రవర్తి ఆలయంలో తరువాత కాలంలో పునరుద్ధరించారని టీటీడీ పలు పుస్తకాల్లో ముద్రించింది.

తిరుమలను తలపించేలా..

తిరుమలకు, రామచంద్రమూర్తికి అనుబంధముందని ఇతిహాసం చెబుతుంది. రామచంద్రుడు సీతాన్వేషణ సఫలమవ్వడం కోసం స్వామి పుష్కరిణిలో స్నానమాచరించినట్లు, అందుకు గుర్తుగా తిరుమల ఆలయంలో సీతారాముల విగ్రహాలు ఉన్నాయని భవిష్యోత్తర పురాణంలో ప్రస్తావన ఉంది. తిరుమల ఆలయంలోని విగ్రహాలకు జడధారులు ఉండడం గమనించవచ్చు. శ్రీరాములవారు, ఎక్కడ లేని విధంగా కుడి వైపున సీతాదేవి,ఎడమ వైపున లక్ష్మణ విగ్రహాలు ఉంటాయి. తిరుమల తరహాలోనే కోదండరామాలయంలో స్వామి, అమ్మవార్లు. అర్చనామూర్తులుగా దర్శనమిస్తారు. వైకుంఠ ద్వారాల మాదిరిగానే సువర్ణమయమైన గర్భగుడి ముందు జయవిజయులు ద్వారపాలకులుగా కనిపిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు

తేదీ	ఉదయం	రాత్రి
27.03.2025	ధ్వజారోహణం (ఉదయం 9.15 నుంచి 9.30 వరకు)	పెద్దశేష వాహనం
28.03.2025	చిన్నశేష వాహనం	హంస వాహనం
29.03.2025	సింహ వాహనం	ముత్యపుపందిరి వాహనం
30.03.2025	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
31.03.2025	పల్లకి ఉత్సవం	గరుడ వాహనం
01.04.2025	హనుమంత వాహనం	గజ వాహనం
02.04.2025	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
03.04.2025	రథోత్సవం	అశ్వవాహనం
04.04.2025	చక్రస్నానం	ధ్వజావరోహణం

టీటీడీ పర్యవేక్షణ

తొలినాళ్ల నుంచి కోదండ రామాలయం స్వతంత్రంగా లేదు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉండేది. ఆ ఆలయ అధికారులే దీనిని పర్యవేక్షించేవారు. విజయనగర సామ్రాజ్యంలోని ఉదయగిరి నుంచి వేద పండితులు అర్చకులుగా పనిచేసేవారు. వారి కుటుంబాలకు ఆలయం సమీపంలోనే నివాసవసతి ఉండేది. సువిశాల రాతి గోడలతో, ప్రశాంత వాతావరణంలో ఉండేది. గుడి లోపలి వరుసలో చక్కటి ఉద్యానవనం ఉంది. ఊంజల మండపం, యాగశాల, పోటు వంటివి ఆలయంలోనే నిర్మించారు. ఎత్తయిన రాజగోపురానికి నేరుగా సన్నిధి వీధి చివర దీపస్తంభముండేది. మహంతుల తర్వాత టీటీడీ ఆలయ బాధ్యతలను చేపట్టింది.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన వాహనాలు



రంగులు అద్దుతున్న కళాకారులు

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించండి



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి(టీటీడీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి డిమాండ్ చేశారు. అన్నమయ్య వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమయ్య చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు సంకీర్తనలు ఆలపించారు. అనంతరం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, నారాయణ, మహేష్, రజని తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపులో చోరీ

● తిరుపతి మహిళ అరెస్టు ● రూ.98.50 వేల నగదు స్వాధీనం



శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపులో ఓ మహిళ రూ.98.50 వేలను చోరీచేసి పట్టుబడింది. ఈ దఫా మహాశివరాత్రి ఉత్సవాలు జరగడంతో నగదు అధికంగా ఉండటంతో గురుదక్షిణామూర్తి సన్నిధిలో జరగాల్సిన హుండీ లెక్కింపును అధికారులు అదనపు రూ.500 రాహుకేతు పూజా మండపంలోకి మార్చారు. భ్రమరాంబిక సేవా సమితి ద్వారా కొందరు సేవకులను హుండీ లెక్కింపునకు నియమించారు. మధ్యాహ్నం భోజన విరామం కోసం కొందరు వెలుపలకు వెళ్తుండగా ఆలయ భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. తిరుపతికి చెందిన లావణ్య తాను షుగర్ పేషెంట్‌నని, డైపర్ తప్పక ధరించాలని చెప్పి ఉదయం హుండీ లెక్కింపునకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామానికి వెళ్లే సమయంలో జరిపిన తనిఖీల్లో ఆమె డైపర్‌లో నగదు దాచినట్లు గుర్తించారు. వెంటనే శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. రూ.98,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రికార్డుస్థాయిలో రూ.2.58కోట్ల హుండీ ఆదాయం

శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రికార్డుస్థాయిలో నమోదైంది. గతేడాది శివరాత్రి సమయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.2.16కోట్లు చేకూరింది. ఈ ఏడాది రూ.2.58 కోట్లతో సరికొత్త రికార్డు నమోదైంది. బుధవారం జరిపిన హుండీ లెక్కింపులో రూ.2,58,89,511 వచ్చింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 132 గ్రాములు, వెండి 714.300 కిలోలు, విదేశీ కరెన్సీ 193 వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధించిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్ల సస్పెన్షన్

తిరుపతి(వైద్యం), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్యకళాశాల పరిధిలోని రుయాస్పత్రిలో పారా మెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ బుధవారం సస్పెండు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటప్రసాద్, రాజశేఖర్‌నాయక్ కొద్ది రోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ల్యాబ్‌లోని కొందరు పారా మెడికల్ విద్యార్థినులు వారం కిందట ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు వారం రోజులుగా విచారించి.. బుధవారం నివేదిక అందించింది. ఈ మేరకు ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటప్రసాద్, రాజశేఖర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



టెక్నాలజీ గురు చంద్రబాబు!

● విజ్ఞానాన్ని విధ్వంసానికి వాడొద్దు ● దేశ ప్రగతికి తోడ్పాటునివ్వండి ● విద్యార్థులకు భువనేశ్వరి దిశానిర్దేశం

కుప్పం/గుడుపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుగారు విజ్ఞానంతో కూడిన అభివృద్ధిని ఆకాంక్షిస్తారు. అందుకోసమే పరిశ్రమిస్తారు. టెక్నాలజీ రెండువైపులా పదునున్న కత్తివంటిది. దాన్ని విధ్వంసానికి వాడొద్దు. టెక్నాలజీతో దేశ ప్రగతికి తోడ్పడండి.' అని భువనేశ్వరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు అందరికీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. అయితే ఆ టెక్నాలజీ వినియోగం గాడితప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికాసానికి, తద్వారా దేశ ప్రగతికి టెక్నాలజీని వినియోగించుకోవాలని, విధ్వంసానికి దాన్ని వాడొద్దని విద్యార్థులను హెచ్చరించారు. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులోకి వస్తున్న విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటున్న చంద్రబాబు, తద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి, సామాజిక, ఆర్థిక పరిపుష్ఠికి వినియోగపడేలా ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని ఆయన కోరుకుంటారన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతవరకు వాడుకోవాలో, ఈమేరకు వాటినుంచి లబ్ధిపొంది, అనసరమైనదానికి దూరంగా ఉంచాలో ఎవరికివారు తెలుసుకోవాలన్నారు.

టెక్నాలజీ వాడకం దేవాన్ష్‌కు తెలుసు

టెక్నాలజీని ఎంతమేరకు వినియోగించుకోవాలో, ఎప్పుడు దూరంగా ఉంచాలో తన మనవడు దేవాన్ష్‌కు తెలుసని భువనేశ్వరి చెప్పారు. అధిక సమయం స్ర్కీన్ చూడడంవల్ల చదువుపైన శ్రద్ధ తగ్గి, విద్యార్థుల దృష్టి ఇతరత్రా అనవసరమైన విషయాలపైకి మళ్లుతుందని చివరికి జీవితం గాడి తప్పుతుందని హెచ్చరించారు. 'దేవాన్ష్ ఫోన్లు, ఇతర గాడ్జెట్లు పరిమితంగా మాత్రమే వాడతాడు. అధిక సమయం స్ర్కీన్ ముందు గడపడు. ఓ తల్లిగా చెబుతున్నా, టెక్నాలజీని వికాసానికి మాత్రమే వాడండి' అని భువనేశ్వరి విద్యార్థులకు హితవు పలికారు. గుడుపల్లె మండలంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు 1999లో 172 ఎకరాలు కేటాయించడం ద్వారా సాధిస్తున్న మంచి ఫలితాలు ఇప్పుడు చూస్తున్నామన్నారు. ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మాత్రం 53వ స్థానంలో ఉండడం విచారకమైన విషయమని చెప్పారు. అయితే 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటెంట్లు పొందడంలో భారత్ 6వ స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. విజ్ఞాన రంగంలో పరిశోధనకు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. సైంటిఫిక్ టెంపర్ పెంచే విషయంలో విద్యార్థులకు తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని భువనేశ్వరి హామీ ఇచ్చారు.



అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులతో భువనేశ్వరి

● చంద్రబాబు కుటుంబ సభ్యులు మీరే

'ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిజమైన కుటుంబ సభ్యులంటే మీరే. మీకోసమే ఆయన తెల్లవారుజాము లేచింది మొదలు, రాత్రి 12గంటల దాకా విరామం లేకుండా పనిచేస్తారు.' అని భువనేశ్వరి అన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో భువనేశ్వరి మాట్లాడాక ఒక విద్యార్థిని పైకి లేచి చంద్రబాబు దినచర్య గురించి చెబితే తాము స్ఫూర్తి పొందుతామని అడిగారు. దానికి ఆమె సమాధానమిస్తూ ఏపీని నెంబర్ వన్ స్టేట్ చేయాలన్న తపనతో చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పారు. 'చంద్రబాబుగారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఒక్కోసారి ఆయన రాత్రి ఒంటి గంటదాకా పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే లేచి యోగా, ధ్యానం చేస్తారు.' అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనే ఆయన ధ్యేయమన్నారు. తనకు మొదట్లో రాజకీయాల గురించి పట్టేది కాదన్నారు. హెరిటేజ్ వ్యవహారాలతోపాటు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు నిర్వహణ నా బాధ్యతలు. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్నారని, వారిని చూస్తుంటే తనకు గర్వంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదువులపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగొచ్చని విద్యార్థులకు భువనేశ్వరి ఉద్బోధించారు.

● అమ్మానాన్నలే స్ఫూర్తి

ఎవరికైనా అమ్మానాన్నలే స్ఫూర్తి కావాలని భువనేశ్వరి అన్నారు. తనవరకు తల్లిదండ్రులే స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. 'నాన్నగారు చిన్న వయసులోనే ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి, తర్వాత స్కూలుకు వెళ్లేవారు. కుటుంబంకోసం ఆయన పడిన కష్టం చూస్తూ పెరిగినదాన్ని. మేము నిద్రపోయినప్పుడు వచ్చేవారు. మళ్లీ తెల్లారి లేచేటప్పటికి వెళ్లిపోయేవారు. అమ్మ మమ్మల్ని ఎంతో బాధ్యతగా పెంచింది. నాన్న కష్టం, అమ్మ బాధ్యత చూస్తూ పెరిగినవాళ్లం. మీరు కూడా బాధ్యతగా మెలగాలి.మీ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తేవాలి' అని భువనేశ్వరి విద్యార్థులకు ఉద్బోధించారు.అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, స్థానిక టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన సప్తగిరులు

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య వర్థంతి సందర్భంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో బుధవారం మలయప్పస్వామి ఊంజల్‌సేవలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో సప్తగిరులు పులకించాయి. అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహభాషణం చేస్తూ అన్నమయ్యకు, వారి ఆచార్య పీఠమైన అహోబిలం మఠానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అహోబిలం నరసింహస్వామి అనుగ్రహంతో తాళ్లపాక అన్నమాచార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారన్నారు. ఈ మంత్రోపదేశంలో 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ముందుగా దినము ద్వాదశి, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంలో భాగంగా 'దినము ద్వాదశి నేడు', భావములోనా బాహ్యము, ఎంతమాత్రమునా ఎవ్వరు దలిచిన, పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, నారాయణతేనమో.., వంటి కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం దుంగల స్వాధీనం

మంగళం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాహనం సహా 10 ఎర్రచందనం దుంగలను జిల్లా అటవీశాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌కు అందిన రహస్య సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు బుధవారం తెల్లవారుజామున పంగూరు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపుగా టీఎన్ 31ఏకే 7299 నంబరు గల వాహనం వేగంగా వెళుతుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లిపోవడంతో అధికారులు వెంబడించారు. స్మగ్లర్లు దర్గిపేరి గ్రామానికి కొంతదూరంలో హైవేపై వాహనాన్ని వదలిపారిపోయారు. అధికారులు వాహనంలో తనిఖీ చేయగా పది ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనం సహా వాటి విలువ రూ.5లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ తనిఖీల్లో డీఆర్వో సికిందర్, ఎఫ్‌బీవోలు పురుషోత్తం, శోభారాణి, వాచర్లు పొన్నయ్య, జితేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్ర చందనంతో అటవీశాఖ అధికారులు

ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడిగా మణిగండన్


మణిగండన్ - మునీర్ అహ్మద్

చిత్తూరు సెంట్రల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.మణిగండన్ (యూటీఎఫ్), జి.మునీర్ అహ్మద్ (రూటా)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం తాజా, మాజీ అధ్యక్షుడు మునాఫ్ అధ్యక్షత జరిగింది. ఎన్నికల అధికారిగా స్కూల్ అసిస్టెంట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.నరోత్తమరెడ్డి వ్యవహరించగా, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు గంటా మోహన్, జీవీ రమణ, చెంగల్రాయమందడి ఎన్నికల పరిశీలకులుగా వ్యహరించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కోఛైర్మన్లుగా రామమూర్తి (బీటీఏ), అరుణ్‌కుమార్ (హెచ్ఎంఏ), రహమత్ బాషా (ఎస్ఏఏ), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా మదన్మోహన్‌రెడ్డి (ఎస్టీయూ), చిట్టిబాబు (ఏపీటీఎఫ్ 1938), ముక్తార్ అహ్మద్ (ఏపీటీఎఫ్ 257), మునాఫ్ (ఆప్టా), జిల్లా కార్యవర్గ సభ్యులుగా సోమశేఖర్ నాయుడు (యూటీఎఫ్), మోహన్‌యాదవ్ (ఎస్టీయూ), కిరణ్‌కుమార్(ఏపీటీఎఫ్1938), గోపీనాథ్(ఏపీటీఎఫ్ 257), లక్ష్మీపతి(ఆప్టా), రవీంద్రనాథ్‌రెడ్డి(హెచ్ఎంఏ), మహమ్మదుల్లా(రూటా)లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

సీకే బాబు ఇంట్లో చోరీ కేసులో 3 నెలల జైలు

చిత్తూరు లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడికి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు కోర్టు తీర్పునిచ్చింది. సీకే బాబు నివాసంలో పని చేసే మహేష్ అనే యువకుడు 2023వ సంవత్సరంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో రూ.లక్ష చోరీ చేసి పరారయ్యాడు. ఈఘటనపై సీకే బాబు సతీమణి లావణ్య ఫిర్యాదు మేరకు చిత్తూరు క్రైం స్టేషన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును బుధవారం స్పెషల్ మొబైల్ కోర్టులో విచారించిన న్యాయమూర్తి వెన్నెల నిందితుడు మహేష్‌పై నేరం రుజువు కావడంతో అతడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ స్వాతి వాదించారు.

ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాల వేలం నేడు

చిత్తూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలను వేలం చేయనున్నట్లు చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి, రూరల్ సీఐ పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు చిత్తూరు హెడ్ పోస్టాఫీసు సమీపంలోని రీజనల్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ లేబొరేటరీ ఆవరణలో సారా, కర్ణాటక మద్యం అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ప్రభుత్వం నిర్దేశించిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

పంటలపై ఒంటరి ఏనుగు ప్రతాపం


ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి వద్ద బుధవారం వేకువజామున ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం సూరప్పచెరువు నుంచి ఒంటరి ఏనుగు బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతు మోహన్‌రెడ్డికి చెందిన వరిపంటను ఒంటరి ఏనుగు తొక్కేసింది. సమీపంలోని ఓ విద్యుత్ స్తంభాన్ని కూల్చేసింది. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఒంటరి ఏనుగు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్లను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. పంటలను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో కృష్ణమూర్తి పరిశీలించారు. బాధిత రైతులకు నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు.

నాటుబాంబు పేలి కుక్క మృతి

చౌడేపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాటుబాంబు పేలి పెంపుడు కుక్క మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం జరిగింది. దుర్గసముద్రం పంచాయతీ రాజులూరుకు చెందిన మునీంద్ర గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. ఇతడు ఇంటి వద్ద ఓ కుక్కను పెంచుకుంటున్నాడు. గ్రామ సమీపంలోని రాజులూరు గుట్ట వద్ద గొర్రెలను మేపుతుండగా గొర్రెలతో పాటు కుక్క కాపలాగా వచ్చింది. ఈక్రమంలో వన్యమృగాల వేటగాళ్లు ఏర్పాటు చేసిన నాటుబాంబు పేలడంతో కుక్క తల తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంఘటన స్థలంలో బైక్, కొడవలి, బ్యాగ్, నల్ల మందు, తాడు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసున్నారు.

డీలర్ల దగ్గరున్న జాబితాలో పేరుంటేనే ఈకేవైసీ చేసుకోండి

గంగాధరనెల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు కలిగిన వారంతా ఈకేవైసీ చేసుకోవాల్సిన అవసరం లేదని, ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు మాత్రం చేసుకుంటే చాలని తహసీల్దార్ చంద్రశేఖర్ చెప్పారు.ఈ విషయంలో ఎటువంటి పుకార్లు నమ్మరాదని సూచించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రేషన్‌కార్డుల్లోని సభ్యులు 22,905 మందిదే ఈకేవైసీ పెండింగ్ వుందన్నారు.రేషన్‌కార్డున్న కుటుంబాల్లో ఇంటికి కొత్తగా వచ్చిన కోడలు, అదేవిధంగా రేషన్‌కార్డులో ఇప్పటికే ఉన్న పిల్లలకు ఐదేళ్లు పైబడి ఉంటే వారందరూ ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు.ఏ రేషన్‌కార్డులో ఎంతమంది సభ్యులు ఈకేవైసీ పెండింగ్ ఉన్నారో వారి వివరాలతో కూడిన జాబితా వీఆర్వోల ద్వారా రేషన్‌షాపు డీలర్లకు అందజేశామన్నారు. వారు మాత్రమే డీలర్ల దగ్గరకు వచ్చి ఈనెల 31వతేదీలోగా ఈకేవైసీ చేసుకుంటే సరిపోతుందని తెలిపారు.

సారా నిర్మూలనకు మండల కమిటీల ఏర్పాటు

చిత్తూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు మండల కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డిచెప్పారు. సారా రహిత ఆంధ్రరాష్ట్ర సాధనకోసం నవోదయం 2.0లో భాగంగా బుధవారం గుడిపాల మండలం చిత్తపార, చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సారా తయారు చేయడం, రవాణా, విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. సారా నిర్మూలనకు మండల కమిటీలను ఏర్పాటు చేశామని, గ్రామాల్లో సారా తయారీని అరికట్టేందుకు ఈ కమిటీలు కీలకంగా పనిచేయాలని కోరారు.

పంటకుంటల లక్ష్యం నెరవేరేనా?


పంటకుంట

చిత్తూరు సెంట్రల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతున్నాయి.భూగర్భజలాల వృద్ధికోసం జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)ద్వారా ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత, సామాజిక పంట కుంటలు తవ్వించడం ప్రభుత్వ లక్ష్యం.అయితే ఏడు వేల పంట కుంటల లక్ష్యానికి ఏడాది కాలంలో జిల్లాలో కేవలం 38 మాత్రమే పూర్తి చేయడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.వేసవిలో నీటి ఎద్దడిని నివారించడంతో పాటు పంట సాగులో రెండు మూడు తడులకు పంట కుంటలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. పైగా పంట కుంటల పనులకు ఉపాధి హామీ కూలీలను ఉపయోగించుకునే వెసులుబాటు కూడా వుంది.పెనుమూరు, యాదమరి,గుడిపాల, ఎస్ఆర్‌పురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచెర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం లాంటి కరువు మండలాల్లోనైనా పూర్తి స్థాయి పంట కుంట నిర్మాణాలు చేపట్టి ఉంటే ఇక్కడి రైతులకు ఎంతో కొంత ప్రయోజనం కలిగేది.

పంట కుంటల లక్ష్యం	7 వేలు
మంజూరైనవి	4832
అనుమతి వచ్చినవి	945
గ్రౌండింగ్ చేసినవి	273
50 శాతం పూర్తి	368
పూర్తి చేసిన చిన్న పంటకుంటలు	235
ప్రారంభ దశలో వున్నవి	31
వంద శాతం పూర్తి చేసినవి	38

ప్రయోజనాలు ఇవే

వేసవిలో సాగు చేసే పంటలకు నీరు అందుబాటులో లేక రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకంలో 5 సెంట్ల విస్తీర్ణంలో పంటకుంట తవ్వుకునే వెసులుబాటు కల్పించారు. దీని పరిమాణం ఆధారంగా రూ.30 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు మంజూరు చేస్తారు. పొలాల్లో లోతట్టున వీటిని నిర్మిస్తే వర్షాకాలంలో వాననీరు వాటిల్లోకి చేరుతుంది. ఇది భూమిలో ఇంకి భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. బోరుబావులకు నీటి లభ్యత పెరుగుతుంది. అత్యవసర సమయాల్లో ఒకటి, రెండు తడులకు ఈ నీటిని ఉపయోగించుకునే వీలుంది. పంట కుంటల గట్లపై తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, మొక్కలు సాగు చేసి ఏడాది పొడుగునా ఇంటికి అవసరమైన పంటలను పండించుకునే వెసులుబాటు రైతులకు లభిస్తుంది.

మిగిలింది మూడు రోజులే

2024-25 వార్షిక సంవత్సరానికి జిల్లాలో పంట కుంటల లక్ష్యం పూర్తి చేసేందుకు మిగిలింది మూడు రోజులే. జిల్లాకు 7 వేల లక్ష్యం కాగా కేవలం 38 పంట కుంటల పనులు మాత్రం పూర్తి చేశారు.

విద్యార్థిదశ నుంచే పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

● జడ్జిలు శ్రీనివాసరావు, బాబు నాయక్, పద్మజ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

బంగారుపాళ్యం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఎల్ఎస్ఏ జడ్జిలు శ్రీనివాసరావు, బాబు నాయక్, పద్మజలు అన్నారు. బుధవారం మండలంలోని సంక్రాంతిపల్లె సచివాలయంలో గ్రామస్తులు, విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వచ్చిన జిల్లా తొమ్మిదవ అదనపు జడ్జి శ్రీనివాసరావు, ఐదవ అదనపు జిల్లా జడ్జి బాబు నాయక్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పద్మజ హాజరయ్యారు. 18 సంవత్సరాలోపు ఉన్న పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే కఠిన చర్యలుంటాయని, దీన్ని నియంత్రించేందుకు పోక్సో చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. అనంతరం బంగారుపాళ్యంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో వారు సమావేశమయ్యారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉందో లేదో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉంటే స్నేహితులతో పంచుకోవాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, సోషియల్ వెల్ఫేర్ డీడీ చిన్నియ్య,ఎస్ఐ ప్రసాద్, హాస్టల్ వార్డెన్ గీత, అధికారులు పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ పరీక్షకు 616 మంది గైర్హాజరు


చిత్తూరు సంతపేట పీఎస్ఎన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

చిత్తూరు సెంట్రల్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షల్లో భాగంగా బుధవారం జిల్లాలో ఫిజికల్ సైన్స్ పరీక్ష జరిగింది. 22,265 మంది విద్యార్థులకు గాను 21,649 మంది హాజరు కాగా, 616 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. టెన్త్ జనరల్‌లో 21,143 మందికి గాను 20,895 మంది హాజరు కాగా, 248 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో 1,122 మందికి గాను 754 మంది హాజరుకాగా, 868 మంది గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. జిల్లా పరిశీలకులు జ్యోతికుమారి నాలుగు కేంద్రాలను పరిశీలించగా, డీఆర్వో మోహన్‌కుమార్ ఒక కేంద్రం, డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్, ఏడీ వెంకటేశ్వరావు మూడు కేంద్రాలను పరిశీలించారు. 15 ఫ్లయింగ్ స్క్వాడ్లు 19 కేంద్రాలను పరిశీలించగా, 65 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ విధులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినా, తనిఖీల పేరుతో విద్యార్థులను పరీక్షా కేంద్రాల ముందు క్యూలో నిల్చోబెట్టడంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సందర్భంగా పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతించే వెసులుబాటు ఉన్నా, వాటిని విస్మరించి పావు నుంచి అరగంట ముందు తనిఖీలు చేసి లోనికి పంపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్పందించిన విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుంగనూరులో స్తంభించిన ట్రాఫిక్

రెండుగంటలు ఎక్కడి వాహనాలు అక్కడే - క్రమబద్ధీకరించడంలో పోలీసుల విఫలం


గంగమ్మ ఆలయం వద్ద పూలు చల్లడానికి వచ్చిన హెలికాప్టర్ వల్ల గాలితీవ్రతకు పడిపోయిన షామియానాలను సరిచేస్తున్న పోలీసులు - కోనేరు వద్ద ఆగిపోయిన వాహనాలు

పుంగనూరు, మార్చి26(ఆంధ్రజ్యోతి): సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం పుంగనూరులో ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ నియంత్రించడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు ప్రకటించినా ఆచరణలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నగరిలో సుగుటూరు గంగమ్మ దర్శనం బుధవారం రాత్రి వరకే వుండడంతో ప్రజలు దర్శనం కోసం అధిక సంఖ్యలో వచ్చారు.మొక్కులు చెల్లించాలని గెరిగెలతో వచ్చారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన జనం దర్శనానికి రావడంతో రద్దీ అసాధారణంగా పెరిగింది. ఎక్కడపడితే అక్కడ వాహనాలను అనుమతించడంతో ఎదురెదురుగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు ఏమాత్రం స్థలంలేక ఇరుక్కుపోవడంతో చిన్న సందుల్లో కూడా వాహనాలు ఆగిపోయాయి. రెండుగంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. స్థానిక పుంగమ్మ చెరువు కట్ట, కట్టకిందపాళ్యం, కుమ్మరవీధి, బజారు వీధి, కోనేరు, మినీబైపాస్‌రోడ్డు, దర్గా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతమయ్యారు.

పుంగనూరంటే ప్రాణం


గంగమ్మ ఆలయంలో సప్తగిరి

పుంగనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు అంటే తనకు ప్రాణమని సినీనటుడు సప్తగిరి చెప్పారు. బుధవారం సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా ఆయన హెలికాప్టర్‌లో బెంగళూరు నుంచి పుంగనూరుకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ చిన్నతనమంతా పుంగనూరులో సాగడంతో చదువు, ఆటపాటలు, తిరిగిన వీధులు, సైకిల్ తొక్కిన రోడ్లు, ఇండ్లు, మాట్లాడేతీరు, ఇవన్నీ చాలా ఇష్టమని, ఇక్కడి జ్ఞాపకాలు మరవలేనని తెలిపారు. ఏటా అమ్మవారి జాతరకు వచ్చి మొక్కులు తీర్చుకోవడం జరుగుతోందన్నారు. తన ప్రతి సినిమాలో పుంగనూరు పేరు ఉంటుందని, పుంగనూరు ఆవుపై పాట కూడా రాయించుకున్నానని చెప్పారు. పుంగనూరు ప్రజలు సుగుటూరు గంగమ్మ ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

ఐదు మండలాల్లో వడగాడ్పులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గురు, శుక్రవారాల్లో ఎండతీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది.బుధవారం ఐదు మండలాల్లో వడగాడ్పులు వీచాయి. మండలాలవారీగా ఉష్ణోగ్రతల విషయానికి వస్తే నింద్రలో 40.1డిగ్రీలు, శ్రీరంగరాజపురంలో 39.8, తవణంపల్లె, నగరి మండలాల్లో 39.6, పలమనేరు, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 38.7, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 38.2, రొంపిచెర్ల 38, యాదమరి మండలాల్లో 37.8, బంగారుపాళ్యం, చౌడేపల్లి, ఐరాల, పాలసముద్రం , పెనుమూరు, విజయపురం మండలాల్లో 37.6, వి.కోట, గంగవరం మండలాల్లో 37.5, సదుంలో 37.3, సోమలలో 37, పెద్దపంజాణిలో 36.8, శాంతిపురంలో 36.2, రామకుప్పంలో 35.7, కార్వేటినగరంలో 35.6, బైరెడ్డిపల్లిలో 35.2, కుప్పంలో 34.5, పుంగనూరులో 34.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేడు కృష్ణాపురానికి మంత్రి రాంప్రసాద్

టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి పరామర్శ

పుంగనూరు రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీలోని కృష్ణాపురం రానున్నట్లు టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి తెలిపారు. ఇటీవల కృష్ణాపురానికి చెందిన వైసీపీ కార్యకర్త వెంకట్రమణ దాడిలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఐదుగురు ఎమ్మెల్యేలు కూడా హాజరుకానున్నట్లు తెలిపారు.

రేపు భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు పరికరాల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష కింద జిల్లాలోని భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగులకు ప్రభుత్వ చేయూత కింద 2024-25 సంవత్సరానికి గాను ఉపకరణాలు అందించనున్నట్లు ఏపీసీ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 301 మంది దివ్యాంగులకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గుర్తించిన దివ్యాంగులకు రూ.29.24 లక్షల వ్యయంతో ట్రైసైకిళ్లు, వినికిడి, చేయూత పరికరాలను శుక్రవారం స్థానిక పీవీకేఎన్ కళాశాల సమీపంలోని మహాత్మ జ్యోతిరావుపూలే భవనంలో ప్రజాప్రతినిధులతో అందించనున్నట్లు తెలిపారు.

సిలిండర్ సొమ్మందలేదా?

ఉచిత గ్యాస్ సొమ్ముకు సాంకేతిక చిక్కులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గతేడాది నవంబరు నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏడాదికి మూడు చొప్పున రాయితీ సిలిండర్లు ఇవ్వాలని నిర్ణయించగా ఈ నెలాఖరు దాకా మొదటి సిలిండర్ పొందడానికి అవకాశముంది. డబ్బిచ్చి సిలిండర్ తీసుకున్న వారిలో కొంతమందికి వారంలోనే ఆ సొమ్ము వారి ఖాతాల్లో జమయ్యింది. సాంకేతిక కారణాలతో అందని వారికోసం టోల్‌ఫ్రీ నెంబరు, ఆయిల్ కంపెనీల నెంబరు ఏర్పాటు చేశారు.

● కారణాలివి ....

లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా మనుగడలో లేకపోవడం, ఒక లబ్ధిదారుడికి రెండుమూడు బ్యాంకు ఖాతాలుండడం, బ్యాంకు ఖాతాతో ఆధార్ సంఖ్య అనుసంధానం కాకపోవడం, గ్యాస్ కనెక్షన్‌కు ఇచ్చే ఖాతానెంబరుతో లబ్ధిదారుడి ఈకేవైసీ పూర్తికాకపోవడం లాంటి కారణాలతో సిలిండర్‌కు చెల్లించిన సొమ్ము తిరిగి బ్యాంకు ఖాతాకు చేరడం లేదు. కుటుంబంలో గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరుతో ఉండగా, వినియోగించేవారు మరొకరున్నప్పుడు కనెక్షన్ ఉన్నవారికే సొమ్ము జమవుతుంది. గత ప్రభుత్వంలో అరంచెల తనిఖీ చేపట్టకుండా రేషన్ కార్డులు ఇచ్చేశారు. వీటికి డీబీటీ తప్పించి మిగతా పథకాలు వర్తింపజేశారు. ఇప్పుడు ఈ కార్డులపై ఆరంచెల తనిఖీ చేపట్టగా, కొన్ని అనర్హమైనవిగా గుర్తించారు. ఇలాంటి వారికి నగదు జమ కావడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా రాయితీ జమకాని లబ్ధిదారులున్నారు. వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లుందని, ఆరునెలల విద్యుత్ వినియోగం 1800 యూనిట్లు దాటిందని, నాలుగు చక్రాల వాహనం ఉందని, గ్యాస్ కనెక్షన్‌తో ఆధార్ సంఖ్య అనుసంధానం కాలేదనే కారణాలతో రాయితీ సొమ్ము జమకాని వారు డీఎస్వో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన గడువు ఈనెల 31వ తేదీతో ముగియనుంది. ఇప్పటికీ గ్యాస్ సిలిండర్ నమోదు చేసుకోనివారు వెంటనే చేసుకోవాలి. లేకుంటే ఒక ఉచిత సిలిండర్ సౌకర్యాన్ని కోల్పోవాల్సి వస్తుంది.

● సమస్యలుంటే సంప్రదించండి



దీపం-2 పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులు బుక్‌చేసుకున్న తక్షణమే అందిస్తున్నాం. రాయితీ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుంది. రాయితీ సొమ్ము పడకపోవడానికి కారణాలు తెలుసుకోవడానికి ఆయా గ్యాస్ ఏజెన్సీలకు జాబితాలు పంపాం. సమస్య పరిష్కరించుకుంటే రాయితీ వస్తుంది. వచ్చేటప్పుడు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకుని రావాలి. టోల్‌ఫ్రీ నెంబర్లకు చెప్తే వారు మాకు సమాచారం ఇస్తారు. పరిశీలించి వినియోగదారుడికి మరలా సమాచారం అందిస్తాం.

- శంకరన్, డీఎస్వో

రామకుప్పంలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఎన్నికల నిర్వహణపై సూచనలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు రాజు

రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులురాజు తెలిపారు. బుధవారం ఎన్నికలకు సంబంధించి మండల సచివాలయంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని.. ఎంపీటీసీ సభ్యులు తమ గుర్తింపు కార్డులతో ఉదయం 10 నుంచి 11 గంటల లోపు ఎన్నికలు జరిగే మండల సచివాలయానికి చేరుకోవాలన్నారు. 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా లోపలకు అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై తహసీల్దారు కౌలేష్, ఎంపీడీవో మురళీధర్‌రెడ్డిలకు పలు సూచనలు చేశారు.

పాడిరైతులకు పశుగ్రాస విత్తనాల పంపిణీ



రైతులకు పశుగ్రాసం విత్తనాలను అందజేస్తున్న ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నకృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్య కేంద్రంలో రైతులకు రాయితీ పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పాడిరైతులకు 75 శాతం సబ్సిడీతో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 11 టన్నుల జొన్న విత్తనాలను సరఫరా చేసిందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు మండలంలోని పశువైద్యకేంద్రాలు, రైతుసేవాకేంద్రాల్లో పొందవచ్చన్నారు. రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకెళ్లాలని కోరారు. ఒక్కో పాసుపుస్తకానికి 20 కిలోల చొప్పున విత్తనాలకు అందజేస్తామని పశువైద్యాధికారి రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, సాగునీటి సంఘం చైర్మన్ పద్మనాభరెడ్డి, నేతలు వెంకటరమణ, బాలరాజు, హనీఫ్, ఆంజి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గృహాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



అశోక్‌నగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

కల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గృహాలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ చిత్తూరు ఎస్ఈ (ఆపరేషన్) ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. పులిచెర్ల మండలం అశోక్‌నగర్ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరాను బుధవారం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయానికి రోజుకు 9గంటలు పాటు విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈలు శ్రీనివాసమూర్తి, అమర్‌బాబు, ఏడీ నాగేంద్ర, ఏఈ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం వైద్యాధికారికి సన్మానం



వైద్యాధికారి శ్రీనివాసులును సన్మానిస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది

గంగవరం, మార్చి 26 : జిల్లాలో ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న గంగవరం పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులును సహచర డాక్టర్లు, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. గంగవరం పీహెచ్‌సీలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ వైద్యసేవలందించినందుకు చిత్తూరులో ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రం అందించారు. దీంతో సహచర సిబ్బంది కలిసి డాక్టర్ శ్రీనివాసులును శాలువ, పూలమాలలతో సత్కరించి అభినందించారు. డాక్టర్ లహరి, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో గర్భిణులకు పౌష్టికాహారం



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న కల్పన

రామకుప్పం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారం, ఆరోగ్యంతో కూడిన విద్య అనే అంశాలపై బుధవారం శాంతిపురం సీడీపీవో కల్పన ఆధ్వర్యంలో రామకుప్పం ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా క్రమం తప్పకుండా.. సకాలంలో గర్భిణులు, చిన్నారులకు పోషకాహారాన్ని అందజేయాలని కోరారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. పర్యవేక్షకులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి



పెద్దఉప్పరపల్లెలో గడ్డివిత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి తదితరులు

సోమల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు రాయితీతో అందజేస్తున్న గడ్డివిత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు తెలిపారు. బుధవారం పెద్దఉప్పరపల్లె పశువైద్యశాలలో 75శాతం రాయితీలో మంజూరైన మొక్కజొన్న, జొన్న విత్తనాలను పాడి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి చందనప్రియ మాట్లాడుతూ సోమల మండలానికి మొక్కజొన్నలు 4500 కిలోలు, జొన్న విత్తనాలు 3 వేల కిలోలు మంజూరైనట్లు తెలిపారు. ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పెద్దఉప్పరపల్లె పాడి రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



మున్సిపల్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సమస్యకు ఎప్పటికప్పుడు తక్షణ పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో మున్సిపల్, అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలు, మున్సిపల్ పరిధిలోని తాగునీటి బోర్ల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై చర్చించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు, గంటావూరు ఇళ్లపట్టాల విచారణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ముసలిమడుగు వద్ద ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ హబ్ పనులపై స్థానిక అటవీశాఖ రేంజర్ నారాయణతో ఆయన సమీక్షించారు. తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, ఆర్వో రవిరెడ్డి, సర్వే అధికారి వెంకటరమణారెడ్డి, మెప్మా సీఎంఎం బాబా, డీఈ సురేష్‌కుమార్, ఏఈ స్వప్నప్రియ, టీపీఎస్ ఇందిరా, వీఆర్వో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సదుం ఎంపీపీ ఎన్నిక

సదుం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సదుం మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం ఎన్నిక జరుగనుంది. గతంలో ఎంపీపీగా ఎన్నికైన బొజ్జా ఎల్లప్ప మృతి చెందడంతో కొత్త ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. ఎంపీపీ పదవి ఎస్సీ రిజర్వేషన్ కావడంతో మండలంలోని పాలమంద ఎంపీటీసీ సభ్యురాలు మాధవి (ఎస్సీ- మహిళ) ఎంపీపీ అయ్యే అవకాశం ఉందని ఎంపీటీసీలు అభిప్రాయపడుతున్నారు. గురువారం ఆమె ఎన్నిక లాంఛనం కావొచ్చని తెలిపారు.

పోషకాహారంతో చిన్నారులకు ఆరోగ్యం



శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు

కుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కుప్పం సీడీపీవో ఎం.చంద్రకళ అన్నారు. కుప్పంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న చిన్నారులకు పోషకాహారాన్ని అందించే విధానం గురించి వివరించారు. అలాగే ఆట, పాట, కథల ద్వారా చిన్నారుల్లో వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా 3-6 సంవత్సరాలలోపు పిల్లలకు 'ఆధార్శిల' పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కుప్పం, గుడుపల్లె మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రామకుప్పంలో నిషేధాజ్ఞలు

రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా గురువారం రామకుప్పం పట్టణంలో పోలీసులు నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రామకుప్పం స్థానికులు, ఓటింగ్‌లో పాల్గొనే ఎంపీటీసీలకు మాత్రమే ప్రవేశం ఉందని కుప్పం డీఎస్పీ పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. రామకుప్పంలోకి బయటి వ్యక్తులు ప్రవేశంపై నిషేధం విధించామని పేర్కొన్నారు. విషయాన్ని ప్రజలు గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భౌతికశాస్త్రం పరీక్షకు 1,369 మంది హాజరు

పలమనేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి భౌతిక శాస్త్ర పరీక్షకు ఏర్పాటు చేసిన 7 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,377 మంది విద్యార్థులకు గాను 1369 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో లీలారాణి, బాలసుందరం తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

పలమనేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలపై ఈనెల 28న చేపడుతున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. బుధవారం పలమనేరు సీపీఎం కార్యాలయం వద్ద ఆయన విద్యుత్ షాక్‌ల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్తు చార్జీలను రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు గిరిధరగుప్తా, ఈశ్వరయ్య, రాజా, జయంతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తాం



బసవరాజ పూర్వపు విద్యార్థులు

పుంగనూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు, వృద్ధాశ్రమాల్లో ఉచిత వైద్యసేవలు అందించడానికి తమవంతు కృషి చేస్తామని పుంగనూరు ప్రభుత్వ బసవరాజ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. బుధవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ పాఠశాలలో 1981-1982లో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాల్యంలో చేసిన అల్లరి పనులను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు హరిప్రసాద్, ఉదయ్ కుమార్, హరినాథరెడ్డి, తులసీరామ్, విజయభాస్కర్‌రాజు, ఎన్.ఆర్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పుంగనూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం చదళ్ల చెరువలో జూదమాడుతున్న ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. వివరాలు... మండలంలోని చదళ్ల చెరువులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి 8 మందిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ. 37,480 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈసారైనా ఎన్నికలు పూర్తయ్యేనా..?

● ఎంపీపీ, రెండో వైస్‌ఎంపీపీ అభ్యర్థులు ఖరారు ● రామకుప్పంలో ఉత్కంఠభరిత వాతావరణం



రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మూడున్నరేళ్లకు పైగా ఖాళీగా ఉన్న రామకుప్పం ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ పదవులకు గురువారం ఎన్నికలు జరుగనున్నాయి. టీడీపీ, వైసీపీల ఎత్తుకు పైఎత్తులతో ఈ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠతను రేపుతున్నాయి. గతంలో వైసీపీ అంతర్గత రాజకీయాలతో ఎంపీపీ, రెండో వైస్‌ఎంపీపీ ఎన్నికలు ఐదు సార్లు వాయిదాపడ్డాయి. ఇటీవల వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీ తీర్థం పుచ్చుకువడంతో గురువారం జరిగే ఈ ఎన్నికలు సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో టీడీపీ పోలింగ్ నుంచి వైదొలగడంతో మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులే గెలిచారు. ఎంపీపీ పదవి జనరల్ మహిళలకు రిజర్వు అయింది. మణీంద్రం ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందిన వైసీపీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి భార్య శాంతకుమారిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒకటో వైస్ ఎంపీపీగా రామకుప్పం-2 ఎంపీటీసీ సభ్యుడు సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. రెండో వైస్ ఎంపీపీ పదవి విషయంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు పోటీపడటంతో అప్పట్లో ఆ ఎన్నిక జరగలేదు. ఈ నేపథ్యంలో ఎంపీపీగా ఉన్న శాంతకుమారి 2021 డిసెంబరు 12న అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఎంపీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎంపీపీ శాంతకుమారి మృతి, రెండో వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడటంతో 2022 జనవరి 4న, మే5న, 2023 ఫిబ్రవరి 3న, జూన్ 6న, జూలై 13న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీపీ, రెండో వైస్‌ఎంపీపీ పదవులకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ ఐదు సార్లు ప్రత్యేక మండల సమావేశానికి ఎంపీటీసీలెవరూ హాజరుకాకపోవడంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. తాజాగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మరోసారి ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అప్పట్లో శాంతకుమారి మృతితో ఖాళీగా ఉన్న మణీంద్రం ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు జరిగితే తప్ప ఎంపీపీ, రెండో వైస్‌ఎంపీపీ పదవులకు ఎన్నికలు జరిగే అవకాశం లేకపోయింది. ఆ ఎంపీటీసీ స్థానం అభ్యర్థిత్వం చంద్రారెడ్డి కుటుంబసభ్యుల్లో ఒకరికి కేటాయించి, వారు గెలిచిన తర్వాత వారికి ఎంపీపీ పదవి కట్టబెట్టాలని వైసీపీ అధిష్టానవర్గం నిర్ణయించింది. అధిష్టానం ఆదేశాల మేరకే ఐదు సార్లు జరిగిన ఎన్నికల ప్రక్రియకు ఎంపీటీసీ సభ్యులంతా దూరంగా ఉన్నారు. కానీ ఇప్పటి వరకు మణీంద్రం ఎంపీటీసీకి ఉప ఎన్నిక జరగలేదు.

పోటాపోటీగా క్యాంపులు

రామకుప్పం ఎంపీపీ, రెండో వైసీపీ ఎన్నికలను టీడీపీ, వైసీపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. పోటాపోటీగా క్యాంపులు నిర్వహించారు. గతంలో ఎంపీపీగా శాంతకుమారి మృతితో ప్రసుత్తం మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీలున్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నేతలు ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవుల కైవసానికి రామకుప్పం-1 ఎంపీటీసీ ఫిర్దోస్, ముద్దనపల్లె ఎంపీటీసీ మంజునాథ్, విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామగౌడు, ఉస్సిగానిపల్లె ఎంపీటీసీ సులోచన, సింగసముద్రం ఎంపీటీసీ అశ్విని, పంద్యాలమడుగు ఎంపీటీసీ జయమ్మ, గౌరివిమాకులపల్లె ఎంపీటీసీ సుబ్బమ్మలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఏడు మంది ఎంపీటీసీలతో టీడీపీ తమిళనాడు రాష్ట్రంలో క్యాంపు ఏర్పాటు చేసినట్టు తెలిసింది. అదేవిధంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి మార్గనిర్దేశకంలో వైసీపీలో మిగిలిన 8 మంది ఎంపీటీసీలను బెంగళూరులోని క్యాంపునకు తరలించినట్లు సమాచారం.

అభ్యర్థులు ఖరారు

గురువారం జరుగనున్న ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ పదవులకు టీడీపీ, వైసీపీ అభ్యర్థులు దాదాపు ఖరారయ్యాయి. టీడీపీ ఎంపీపీ అభ్యర్థిగా ఉస్సిగానిపల్లె ఎంపీటీసీ సులోచన, వైస్ ఎంపీపీగా విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామేగౌడు పేర్లు ఖరారు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అలాగే వైసీపీ ఎంపీపీ అభ్యర్థిగా బందార్లపల్లె-2 ఎంపీటీసీ సుధామణి, వైస్ ఎంపీపీ అభ్యర్థిగా కెంచనబల్ల ఎంపీటీసీ చలపతిలను ఖరారు చేసినట్లు సమాచారం.

ఉత్సాహంగా నారా భువనేశ్వరి పర్యటన

● హారతులు, కోలాటాలతో నాయకులు, మహిళలు ఘన స్వాగతం



కర్ణాటక రాష్ట్రం నంది గోశాలలో తాగునీటి బోరు ప్రారంభిస్తున్న భువనేశ్వరి



తండ్రి ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తూ...

కుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బుధవారం కుప్పం నియోజకవర్గ పర్యటన ఉత్సాహంగా సాగింది. కోలాటాలు, హారతులతో ఆమెకు ఘన స్వాగతం లభించింది. తొలుత గుడుపల్లె మండలం బిసానత్తం వద్ద ఆంధ్రా-కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో మధ్యాహ్నం 12.30 గంటలకు భువనేశ్వరికి టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, పూలమాలలు అందించి ఆమెను సాదరంగా ఆహ్వానించారు. పలు చోట్ల మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. భువనేశ్వరి సరిహద్దు నుంచి నేరుగా గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చేరుకున్నారు. అక్కడ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారికి దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భువనేశ్వరి సహపంక్తి భోజనం చేశారు. అక్కడి నుంచి గుడిచెంబగిరి గ్రామం చేరుకుని మహిళలతో సమావేశమయ్యారు. మహిళలతో కలిసి ఉత్సాహంగా కోలాటం ఆడారు. గుడిచెంబగిరి నుంచి ఆమె కుప్పంలోని పీఈఎస్ గెస్ట్ హౌస్‌కు చేరుకుని టీడీపీ ముఖ్య నేతలతో సమావేశమై పార్టీ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భువనేశ్వరి ఆంధ్రప్రదేశ్ - కర్ణాటక సరిహద్దుల్లో కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ జిల్లా నంది గోశాలలో తాను వేయించిన బోరును ప్రారంభించారు. గోమాతలకు పూజలు చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూజచేసి నివాళులర్పించారు.

టీడీపీలో కష్టపడిన వారికే ప్రాధాన్యత

● చల్లా రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

సోమల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ కోసం కష్టపడిన వారు అక్రమంగా జైలుకు వెళ్లారని వారిని గుర్తించి అధిక ప్రాధాన్యత ఇస్తామని పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోమల ఏఎంసీ కార్యాలయం వద్ద పుంగనూరు నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా నియోజకవర్గంలో భూకబ్జాలు, అక్రమాలు, దౌర్జన్యాలు చేశారని.. ఇకపై వారి ఆటలు సాగనివ్వమని హెచ్చరించారు. పార్టీ అధికారంలోకి వచ్చినా అధికారులు మాత్రం వైసీపీ నాయకులతో కుమ్మక్కై ఉన్నారని.. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న సభ్యులకు పార్టీ నుంచి గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు తమ పరిధిలోని ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని.. ప్రజల మన్నలను పొందాలన్నారు. ప్రతి మండలానికి రూ. 3 కోట్లు మేరకు ప్రాధాన్యత క్రమంలో పనుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. తాగునీరు, రోడ్డు మరమ్మతులు, వీధి లైట్లు, పైపులైన్ల పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యంనాయుడు, రామనాథం నాయుడు, రమణ, గువ్వల రమేశ్‌రెడ్డి, రెడ్డిప్రసాద్‌రెడ్డి, వరదం జనార్ధన్, వెంకట్రమణ, కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ఉమాపతి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్, మురళీధర్‌నాయుడు, శివశంకర్, మల్లికార్జున, చాణుక్య, వేణుగోపాల్ నాయుడు, అష్రఫ్ అలీ, రమేశ్‌నాయుడు, అమరనాథ్, విశ్వనాధరెడ్డి, మోహన్ నాయుడు, బోస్, భానుప్రకాశ్, కోటీశ్వర్‌రావు, బాలాజీ నాయుడు, ఈశ్వర్‌యాదవ్, వైవీ సుబ్బయ్యశెట్టి, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

రామకుప్పం పంచాయతీకి పెరిగిన ఆదాయం



రామకుప్పంలో వేలంలో పాల్గొన్న నేతలు, అధికారులు

రామకుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మేజర్ పంచాయతీలో 2025-2026 సంవత్సరానికి గాను బుధవారం ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి సమక్షంలో వివిధ హక్కుల కోసం వేలం నిర్వహించారు. గత ఏడాది వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండ్లకు వేలంతో రూ.3,40,000 ఆదాయం వచ్చింది. బుధవారం నిర్వహించిన వేలంలో రూ.3,65,000 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, సర్పంచి మురళీ, పంచాయతీ కార్యదర్శి వెంకటరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందూరు పంచాయతీకి...



కందూరులో వేలంలో పాల్గొన్న అధికారులు

సోమల: కందూరు పంచాయతీకి ఈ ఏడాది వేలంతో ఆదాయం పెరిగింది. బుధవారం స్థానిక సచివాలయంలో జరిగిన వేలంలో వారపు సంతను రూ.8.20 లక్షలకు పి. ద్వారకనాథ్‌రెడ్డి, ప్రైవేట్ బస్టాండ్‌లో గేటు వసూళ్లకు రూ.1.32 లక్షలకు అల్తాఫ్ పోటీ పడి దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.3.65 లక్షలు ఆదాయం పెరిగింది. బసినాయిని చెరువును రూ.25,100, తిప్పాని చెరువున రూ.12,100 లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, సర్పంచి బాషా మసూద్, కార్యదర్శి జయశంకర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక నేరాల నియంత్రణకే పోక్సో చట్టం



సదస్సులో మాట్లాడుతున్న అదనపు సివిల్ జడ్జి వరుణ్‌తేజ్

కుప్పం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై లైంగిక నేరాలను నియంత్రించడానికి, నేరాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడానికే పోక్సో చట్టం ఉందని కుప్పం అదనపు సివిల్ జడ్జి పి.వరుణ్ తేజ్ అన్నారు. గుడుపల్లె మండలం కేజీబీవీ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పరిచయస్తులు, స్నేహితులుగా ఉంటూ చిన్నారులను మభ్యపెట్టి వారిపై లైంగిక నేరాలకు పాల్పడిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులకు ఈ విషయాలలో వారి పరిధిలోనే అవగాహన కలిగించాలని సూచించారు. చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడినవారిపై పోక్సో చట్టంతో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, బువనేశ్వరి, స్కూల్ కమిటీ చైర్మన్ రామచంద్రుడు, కోర్టు సిబ్బంది రాజా, లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేశ్, సెల్వం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నక్కబండలో లోపించిన పారిశుధ్యం

● వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు



నక్కబండ వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

పుంగనూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శివార్లలోని నక్కబండ కాలనీలో పారిశుధ్యం లోపించి దుర్వాసన వెదజల్లుతోంది. గత ప్రభుత్వంలో కాలనీలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు నిర్మించారు. మురుగు కాల్వలను సక్రమంగా నిర్మించకపోవడంతో ఇళ్లలోని వ్యర్థపునీరు, మరుగుదొడ్ల నీరు రోడ్లపై వదలడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నెలరోజులకు ఒక్కసారైనా కాల్వలు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం నిల్వతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో రోడ్డుపై వాహనాలు వెళ్లాలన్నా.. ప్రజలు నడవాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో ఎక్కడ రోగాలు వ్యాప్తి చెందుతాయో అని స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగునీటి నిల్వతో విషజ్వరాలు సోకి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువ శాతం కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 2500 ఇళ్ల కాపురం ఉన్న ఈ కాలనీలో మురుగుకాల్వలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారంలో ఒక్కసారైనా కాల్వలు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని మహారాజపురానికి చెందిన పురుషోత్తంరాజుకు రూ.2,17,200లు, కేవీపురంకు చెందిన నాగస్వామి నాయుడికి రూ.95,537లు, గంగమాంబాపురానికి చెందిన మునిరత్నం నాయుడికి రూ.37,483లు చెక్కును పంపిణీ చేశారు. సాయం పొందిన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చిన బాబు, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



తెలుగు మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను తెలుగు మహిళా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగు మహిళలతో 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు జరుగుతున్న తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని.. వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని చెప్పారు. కుటుంబ సాధికార సభ్యుల (కేఎస్ఎస్) ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

పాలసముద్రంలో రూ.7కోట్లతో అభివృద్ధి పనులు

● ప్రభుత్వ విప్ థామస్

పాలసముద్రం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలాభివృద్ధి కోసం రూ.7కోట్లతో పనులు మంజూరు చేసినట్లు ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ తెలిపారు. మండలంలోని రంగాపురం వద్ద బలిజకండ్రిగ - బెంగళూరు, రంగాపురం - బెంగళూరు వరకు రెండు ప్రైవేట్ బస్సు సర్వీస్‌లకు బుధవారం ఎమ్మెల్యే పూజలు చేసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రెండు బస్సులు ప్రతిరోజూ రెండు ట్రిప్పులు రాకపోకలు సాగిస్తాయన్నారు. మండలంలో రూ.7కోట్లతో 13 పంచాయతీల్లో 63 చోట్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. తర్వాత థామస్‌ని పలువురు నేతలు శాలువలు కప్పి, గజమాలలతో సన్మానించారు. ఈసందర్భంగా పెద్దఎత్తున టపాసులు పేల్చడంతో వాటి నిప్పురవ్వలు సమావేశం కోసం ఏర్పాటుచేసిన షామియానాపై పడటంతో అది కాలిపోయింది. కార్యకర్తలు సకాలంలో స్పందించడంతో ఎలాంటి ఆస్తి నష్టం సంభవించలేదు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, టీడీపీ నేతలు తాళ్లూరు శివ, బాలాజి, అరుల్‌నాధన్, రవి నాయుడు, వెంకటేశులు నాయుడు, స్వామిదాస్, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.32,664 రికవరీ

విజయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విజయపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.32,664లు రికవరీకి ఆదేశించినట్లు ఎన్ఆర్జీఎస్ పీడీ రవికుమార్ తెలిపారు. మండలంలో 2023వ సంవత్సరం ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మొత్తం ఉపాధిలో రూ.7,11,30,551లకు వివిధ పనులు నిర్వహించారు. ఉపాధి పనులపై ఫిబ్రవరి 10 నుంచి ఫిబ్రవరి 24 వరకు గ్రామాల్లో విచారణ నిర్వహించి పరిశీలించారు. కందకాలు, పండ్ల మొక్కల పెంపకాలలో రికవరీ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, ఏపీడీ సునీల్‌కుమార్, ఏపీవో బబిత, జేఈ మధుబాబు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

31లోపు పన్ను చెల్లిస్తే 50శాతం వడ్డీ మాఫీ

నగరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో బకాయి వున్న ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్ను మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే 50శాతం వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50శాతం తగ్గిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పన్నులు మున్సిపల్ ఆఫీసులోని ప్రత్యేక కౌంటర్‌లో గాని, ఆన్‌లైన్ ద్వారా గానీ చెల్లించవచ్చన్నారు.

పాలలో కల్తీని అరికట్టాలి

వెదురుకుప్పం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఓ ప్రైవేటు పాల సేకరణ కేంద్రంలో కల్తీని అరికట్టాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ప్రధానకార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం కార్వేటినగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల నుంచి సమపాళ్లలో వెన్నశాతం కలిగిన స్వచ్ఛమైన పాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి తర్వాత కల్తీ చేసి తక్కువ వెన్నశాతంతో నాణ్యత లేని పాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. రైతులకు అధిక ధర ఇవ్వాలని కోరారు. పాల కల్తీపై రాజీలేని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన కాళీచరణ్‌బస్వా బుధవారం రూ.1,01,116 విరాళంగా చెక్కు రూపంలో అందించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

వెదురుకుప్పం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రిన్సిపాల్ బి.అన్నపూర్ణశారద హాజరయ్యారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నేత మురళీనాయుడు అన్నారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో గుడిపాలలో రూ.5కే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదల కోరిక మేరకు సంగటి, భోజనం వడ్డిస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యాన్ని భరించలేక వృద్ధురాలి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తరచూ అనారోగ్యానికి గురికావడంతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. ఎస్ఐ మల్లికార్జున వివరాల మేరకు.. నగర పరిధిలోని గంగాసాగరంలో సుమతి(60), కుమారుడు లక్ష్మీపతి నాయుడు, కోడలితో కలిసి ఉంటుంది. కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తుండగా ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోమ్‌లోనే పనులు చేస్తున్నాడు. ఆమె షుగర్, ఆస్తమా జబ్బులతో తరచూ ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేది రాత్రి ఇంటి బయట ఉన్న సీతాఫలం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి



గాంధీ విగ్రహం సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం గామన్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం రాత్రి పాస్టర్ ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందారని, దీనిపై న్యాయవిచారణ చేపట్టాలని నగర క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఐక్య వేదిక నాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ మృతిపై ప్రభుత్వం నిష్పక్షపాతమైన విచారణ చేసి, దోషులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుడిపాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు -వేలూరు, బెంగుళూరు-చెన్నై రహదారిలో బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని కీలారిపల్లికి చెందిన హరి ద్విచక్రవాహనంలో చిత్తూరు వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

గుడిపాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత 10రోజుల క్రితం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్‌పై కొత్తకోట దళితవాడకు చెందిన జగన్నాథం కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో గుడిపాల పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ సాయినాథ్ బుధవారం దళితవాడకు చేరుకుని విచారించారు.

వేలం ద్వారా రూ.2.80 లక్షల ఆదాయం

పెనుమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవగుంట పంచాయతీలోని సంతగేటుకు బుధవారం ఈవోపీఆర్డీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. రూ.2.80 లక్షలకు కలవగుంటకు చెందిన వ్యక్తి సంతగేటును వేలంలో దక్కించుకున్నారని సెక్రటరీ శేషు తెలిపారు.

నేడు, రేపు ఇఫ్తార్ విందు

చిత్తూరు కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధి చిన్నమసీదులో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. రంజాన్ ముందు వచ్చే శుక్రవారం ముస్లింలు షబేఖదర్‌గా నిర్వహించుకుని తమ పూర్వీకులను మననం చేసుకుని మహమ్మద్ ప్రవక్తకు ప్రార్థనలు చేయడం ఆచారం. అందులో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జాగారం చేసి అల్లాను ప్రార్థిస్తారు. ఈ సందర్భంగా స్థానిక బజారువీధి చిన్న మసీదులో కమిటీ సభ్యులు గురువారం రాత్రి మతాలకతీతంగా ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. అదే విధంగా నగరంలోని మిట్టూరు మసీదులో కమిటీ నాయకులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు.

ఎస్ఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బంగారుపాళ్యం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ఎస్ఐగా ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై బంగారుపాళ్యంకు వచ్చారు.

చింతచెట్టు నరికివేతపై కేసు

గుడిపాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్ పురం రెవెన్యూ గ్రామానికి చెందిన ప్రభుత్వ చింతచెట్టును ఓ వ్యక్తి నరికివేయడంతో అతడిపై తహసీల్దార్ జయంతి ఆదేశాల మేరకు ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేశారు. 197 రామాపురానికి చెందిన బాబు అనే వ్యక్తి గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా వేలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ చింతచెట్టును రాత్రికి రాత్రే నరికివేయడంతో కేసు నమోదుచేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్ఐ రామసాయి, సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఉచిత విద్యుత్ జీవో విడుదలపై ఎమ్మెల్యే హర్షం

నగరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేత, మరమగ్గ కార్మికులకు ప్రకటించిన ఉచిత విద్యుత్‌పై బుధవారం జీవో విడుదల చేయడంతో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కానీ, ఏ రాజకీయపార్టీ కానీ తీసుకోని సాహసోపేత నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్నారని, మరమగ్గ, చేనేత రంగాల వారికి ఇది ఓ వరమని ఆయన అభివర్ణించారు. 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం 10,534 మరమగ్గాలకు అందుతోందన్నారు. చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ పథకం ద్వారా 93 వేల కుటుంబాలు లబ్ధి పొందనున్నట్లు చెప్పారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.125 కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని ఆయన తెలిపారు.

టెన్త్ పరీక్షలకు నలుగురు విద్యార్థుల గైర్హాజరు

గంగాధరనెల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నిర్వహించిన పదవ తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 694 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా, 690 మంది పరీక్షలు రాశారని, నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో ఆంజనేయులుశెట్టి తెలిపారు. గంగాధరనెల్లూరు హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 319 మందికి గాను 318 మంది, నెల్లేపల్లిలో 165 మందికి గాను 164 మంది, తూగుండ్రంలో 210మందికి గాను 208 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

నేడు అర్ధగిరిలో హుండీ లెక్కింపు

తవణంపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరుగుతుందని ఈవో హనుమంతరావు తెలిపారు.

చిత్తూరు ప్రజాదర్బార్‌కు 164 ఫిర్యాదులు

● సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గురజాల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించిన ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 164 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ అముద, కమిషనర నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్లు జయంతి, లోకేశ్వరి, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్సలు పొంది ఆర్థిక సాయం చేయవలసిందిగా గతంలో ఎమ్మెల్యే ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ఆరుగురు లబ్ధిదారులకు రూ.5.34 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చిత్తూరు రూరల్ మండలం జంగాలపల్లికి చెందిన ఎస్.రమేష్‌కు రూ.2.33 లక్షలు, వెంకటాపురం కేశవులు నాయుడికి రూ.75 వేలు, గుడిపాల మండలం పల్లూరు సాయి అఖిల్‌కు రూ.1 లక్ష, శ్రీరంగంపల్లి జయచంద్ర నాయుడికి రూ.53,734, చిత్తూరు అర్బన్‌కు చెందిన వి.నవీన్‌కుమార్‌కు రూ.52,656, డి.రాజుకు రూ.19,883ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

● ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ థామస్

శ్రీరంగరాజపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని తయ్యూరు ఎంపీటీసీ తిరుమలయ్య ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా పిళ్లారికుప్పం, పొదలపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు తమకు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారుకు ఎమ్మెల్యే సూచించారు. మొత్తం 353 అర్జీలు వచ్చాయి. ఎంపీడీవో మోహన మురళి, తహసీల్దార్ లోకనాధం పిళ్లై, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, బాలాజీ నాయుడు, గుండయ్య, రాజశేఖర్ నాయుడు, మునివర్ధ నాయుడు, ఎస్.కుమార్, నిరంజన్‌రెడ్డి, మహబుబ్‌బాషా, వేమ నాయుడు, వెంకటచాలం, చంద్రబాబు రెడ్డి, బాబు నాయుడు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఆర్ పురంలో ప్రెస్‌క్లబ్‌ను థామస్ ప్రారంభించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కాళేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటా

ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటానని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. థామస్ మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథుల నియామకం ద్వారా గ్రామస్థాయిలో మరింత బలమైన నేతలను సమకూర్చుకోవాలన్నారు. అనంతరం కార్యకర్తలకు టీడీపీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

డైయింగ్ యూనిట్లు తొలగించి భావితరాలకు ఆరోగ్యాన్నిద్దాం

● అఖిలపక్ష తీర్మానం



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

నగరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డైయింగ్ యూనిట్లను తొలగించి భావితరాలకు ఆరోగ్యాన్నిద్దామని నగరి మార్కెటింగ్ కమిటీ యార్డులో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. దళిత్‌ఫ్రంట్ రాష్ట్ర నేత గజేంద్ర ఆధ్వర్యంలో ఈ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం కుశస్థలీ నది సమీపంలో ఉన్న చలమలో స్నానం చేసేవారమని, నేడు నది పక్కకు రావాలంటేనే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రంగునీటిని డ్రైనేజీలోకి వదలడంతో అవి కుశస్థలీ నదిలోకి చేరి, చెరువులు, కాలువలలో సైతం రంగునీరు ప్రవహిస్తుందని చెప్పారు. దీంతో నగరిలో తాగునీరు కరువవ్వడమే గాక కలుషిత వాతావరణం నెలకొని వివిధ రకాల వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. తాగునీటి కోసం బోర్లు వేసినా కలుషిత నీరే వస్తోందన్నారు. భావితరాల వారికి ఆస్తులు ఇవ్వలేకపోయినా మంచి ఆరోగ్యాన్ని ఇద్దామంటూ తీర్మానించారు. అలా జరగాలంటే డైయింగ్ యూనిట్ల మూసివేతకు అంచెలంచెలుగా నిరసన చేపట్టి, మూసివేయించే వరకు పోరాటం ఆపరాదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు బీడీ బాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరత్నంరెడ్డి, రామచంద్రారెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు గోవిందస్వామి, సీపీఎం నాయకులు పెరుమాళ్, యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అమృతరాజ్‌నాడార్, బీఎస్పీ నాయకులు నాగూర్, సలీమ్, ఇంద్రయ్య, బిలాల్, ఎల్లప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీదేవి

యాదమరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. మండలంలోని జోడిచింతల వద్ద గల సుచి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన మహిళలు - సాంఘిక, ఆరోగ్య, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి సదస్సులో ప్రసంగించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని తెలిపారు. అనంతరం వరదరాజులపల్లి పంచాయతీలో శ్రీనివాస స్వయం సహాయక డ్వాక్రా గ్రూపు సమావేశంలో డీఆర్డీఏ పీడీ పాల్గొని పుస్తకాలు పరిశీలించి, మహిళల స్వయం సమృద్ధి, సంపద సృష్టికి అందరూ సమష్టిగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, సుచి సిబ్బంది పాల్ గ్లోరి విజయ్‌కుమార్, వరదరాజులు, జాకబ్, చిన్నయ్య, శశికుమార్, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారికి రూ.3.51 లక్షల ఆదాయం

చిత్తూరు కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయ హుండీని ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది, భక్తులు లెక్కించారు. గత 80 రోజులకు గాను రూ.3.51 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో మునిశేఖర్ తెలిపారు. ఈ నగదును స్థానిక ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఆయన చెప్పారు. పంబల్ మణి, దాము, గోపి, భక్తులు పాల్గొన్నారు.

నగరపాలక సిబ్బందికి రంజాన్ కానుకల పంపిణీ

చిత్తూరు కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి: హైరోడ్ షాపరాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక పారిశుధ్య సిబ్బందికి రంజాన్ కానుకలను బుధవారం పంపిణీ చేశారు. నగరపాలక హెల్త్ ఆఫీసరు లోకేష్, సిటీ ప్లానర్ నాగేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య సిబ్బందికి నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ నాయకులు ఎం.హనీఫ్‌షా, ఇమామ్ అబ్దుల్ షుకుర్, ఇలియాస్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి

గంగాధరనెల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆధార్ శీల, నవచేతన కార్యక్రమాలతో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తుందని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి అన్నారు. పోషణ బీ - పడాయి బీ శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు రెండో బ్యాచ్‌కు రెండోరోజు గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం జరుగుతున్న శిక్షణను పీడీ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న మూడురోజుల శిక్షణ ఎంతగానో దోహదం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో వినతశ్రీ, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, నాగరత్నమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు తవణంపల్లె ఎంపీపీ ఎన్నిక

తవణంపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ఎంపీపీ ఎన్నిక స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుంది. ఎంపీపీగా ఉన్న గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు పార్టీలో అంతర్గత ఒప్పందం మేరకు ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో గత ఏప్రిల్ 22 నుంచి మల్లకుంట ఎంపీటీసీ సభ్యుడు వైస్ ఎంపీపీ-2 పట్నం ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీపీ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలవ్వడంతో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నిక జరగనుంది. ఈ సందర్భంగా తవణంపల్లెలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నిక ప్రశాంతంగా జరగడానికి చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

విజయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబరు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఈ ఎన్నికకు కోరం అవసరం లేదని, చేతులెత్తి ఎన్నుకుంటారన్నారు.

ఒకటినుంచి సదరం స్లాట్ల పునఃప్రారంభం

వెదురుకుప్పం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా నిలిచిపోయిన సదరం స్లాట్‌లను ఏప్రిల్ ఒకటో తేది నుంచి పునఃప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వికలాంగుల పెన్షన్ల పంపిణీ ప్రక్రియలో అనర్హులను గుర్తించే కార్యక్రమాన్ని అధికారులు జనవరిలో మొదలు పెట్టారు. ఈక్రమంలో టీడీపీ ప్రభుత్వం రాకముందు ఇచ్చిన సదరం సర్టిఫికెట్లను వైద్య నిపుణులు పరిశీలించి వాస్తవికతను ధ్రువీకరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సదరం సర్టిఫికెట్లను కొత్తగా మంజూరు చేస్తే కొంత గందరగోళ పరిస్థితులు నెలకొంటాయని భావించి ఈ ఏడాది జనవరి నుంచి తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా, తాజాగా సదరం స్లాట్ల పునఃప్రారంభానికి ఏప్రిల్ ఒకటో తేదిని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరం సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్న వారికి శుభవార్తగా మిగిలింది.

నేడు కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

చిత్తూరు అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ అత్యవసర సమావేశం గురువారం జరుగుతుందని మేయర్ అముద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం, మధ్యాహ్నం కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

వేలంతో రూ.22.51 లక్షల ఆదాయం

పూతలపట్టు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు పంచాయతీకి వారపు సంత, పంచాయతీ గదుల ద్వారా రూ.22,51,340 ఆదాయం వచ్చింది. స్థానిక సచివాలయంలో బుధవారం 11 పంచాయతీ కాంప్లెక్స్ గదులకు వేలం నిర్వహించగా, పంచాయతీకి రూ.8,00,340 ఆదాయం రాగా, వారపు సంతకు రూ.14,51,000 ఆదాయం వచ్చింది. గతంలో వారపు సంతకు రూ.13,60,000 ఆదాయం రాగా, ఈ ఏడాది ఆదాయం పెరిగింది.

ఇంటి పట్టాలివ్వాలంటూ దళితుల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నేతలు, దళితుల నిరసన

నగరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 9వవార్డులో గల నెత్తంకండ్రిగ దళితులు నివాసముంటున్న స్థలాలకు ఇంటి పట్టాలివ్వాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. టవర్‌క్లాక్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తమ నిరసన తెలిపారు. పూరి గుడిసెలలో ఉంటున్న 2 సెంట్ల ఇంటి స్థలానికి పట్టా ఇవ్వమనడం నేరమా అని వారు ప్రశ్నించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి వేలన్, నాయకులు బాషా, విజయ్, మేరీ, భారతి, కాంచన, దళితులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

గుడిపాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 29వ తేదీన ఆయా పంచాయతీల్లో గ్రామ కమిటీ అధ్యక్షుల ద్వారా ఘనంగా నిర్వహించాలని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పంచాయతీల్లో ఉదయం పార్టీ జెండాను ఎగురవేసి, మండల కేంద్రానికి చేరుకోవాలని కోరారు.